క్లుప్తంగా

వైభవంగా స్వామి వార్ల కల్యాణ మహోత్సవం



ఈదరాడలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: ఈదరాడ, అప్పనపల్లి, గోగన్నమఠం గ్రామాల్లో కొలువుదీరిన ఈశ్వరుడి కల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల కోలాహలం, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువలా జరిపించారు. ఈదరాడలో కొలువుదీరిన ఉమాసోమేశ్వరస్వామి, లక్ష్మీ నర్సింహస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని రమణీయంగా జరిపించారు. గోగన్నమఠంలో కొలువైన పార్వతీ సోమేశ్వరస్వామి, అప్పనపల్లిలో కొలువుదీరిన కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామి వార్ల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

27న అమ్మవార్ల జాతర



ముత్యాలమ్మ తల్లి

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామ దేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ వార్ల జాతర మహోత్సవం ఈ నెల 27వ తేదీ సోమవారం జరుగుతుందని ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. మూడు రోజుల పాటు జరిగే జాతర మహోత్సవాల్లో భాగంగా 28వ తేదీ మంగళవారం అమ్మవార్లకు నైవేద్యాలు చెల్లిస్తారని, 29వ తేదీ బుధవారం అమ్మవార్ల తీర్థ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రోగికి ఆర్థిక సాయం



దుర్గాప్రసాద్‌కు ఆర్థికసాయం అందిస్తున్న సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ

మలికిపురం: గన్నవరం గ్రామానికి చెందిన డొక్కు దుర్గాప్రసాద్ అనే వ్యక్తికి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. అతడికి ఆర్థిక ఇబ్బందుల వల్ల రాజోలు నియోజకవర్గం శ్రీకృష్ణ యాదవ సంఘాన్ని ఆశ్రయించారు. సంఘం సమకూర్చిన ఆర్థిక సాయాన్ని అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణ చేతుల మీదుగా ఆయనకి సోమవారం అందజేశారు. లక్కవరం శ్రీకృష్ణ ఆలయం వద్ద ఆయనకి రూ.15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రెసిడెంట్ మట్టా వెంకట రామకృష్ణ ప్రధాన కార్యదర్శి నూనె రామకృష్ణ మలికిపురం మండలం అధ్యక్షుడు సూరిమేను రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ గుండుబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో పదో తరగతి సప్లిమెంటరీ సెంటర్

అంబాజీపేట: ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని అంబాజీపేట హైస్కూల్‌కు ప్రభుత్వం మంజూరు చేసినట్లు హెచ్ఎం కడలి సాయిరామ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ అంబాజీపేట పి.గన్నవరం మండలాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు 30 హైస్కూళ్లకు సంబంధించి అంబాజీపేట హైస్కూల్ సెంటర్‌గా మంజూరు చేసిందన్నారు. గరిష్ఠంగా 183 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ప్రతి విద్యార్థి ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్‌పై సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతకం ఉండాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు జరగనున్నాయన్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

కోతలు త్వరగా పూర్తి చేసుకోవాలి

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను కారణంగా మండలంలో మిగిలి ఉన్న వరి కోతలను తక్షణమే పూర్తి చేసేలా రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. మాచవరం, ఇసుకపూడి తదితర గ్రామాల్లో సోమవారం ఏఓ పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని 2990 ఎకరాల్లో వరి సాగు చేపట్టారన్నారు. వరి కోతలు ఇంకా 90 ఎకరాల్లో కోయాల్సి ఉందన్నారు. ఈ నెల 22న తీవ్ర తుపాన్ ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు ముందుగా వరి కోతలను పూర్తి చేయాలన్నారు. వరి కోతలను యంత్ర సాయంతో పూర్తి చేసి పంటను సంరక్షించుకోవాలని సూచించారు.

పనస పండు.. పోషకాలు మెండు

- నోరూరించే తొనలు
- కూరల్లోనూ ఎంతో మేటి

అంబాజీపేట: ఈ సృష్టిలో పుష్పాల నుంచి వచ్చే కాయల మాదిరిగానే ఆ పుష్పాలకు కనపడకుండా నేరుగా వచ్చేది పనసకాయ. వృక్ష శాస్త్రంలో పువ్వు నుంచి పిందె, పిందె నుంచి కాయ, పండు పుట్టుకొస్తూ ఉంటాయి. కాని పనస పండు పట్టిక మాత్రం అలా జరగదు. ఈ చెట్టు మొదలు నుంచి చివరివరకూ ఎక్కడ నుంచైనా కాండం నుంచే పిందె పుట్టుకొచ్చి కాయలు, పండ్లు తయారవుతాయి. అందువల్లనే పనస చెట్టు నిండా కాయలు నిండి ఉంటాయి. అర మగ్గిన పనసపండు తినడానికే జీవించి ఉండాలనే నానుడి ఈ సీజన్‌లో నిజం చేస్తూ ఉంటుంది. సువాసనలు వెదజల్లుతూ నోరూరించే పనసపండు అంటే అందరికీ ఇష్టమే. సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడు అనాసకు ప్రతిగా పనసను సృష్టించాడంటారు. పనసపండులో శరీరారోగ్యాన్ని పెంపొందింపచేసే పలు పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండును ఆంగ్లంలో జాక్‌ఫ్రూట్ అంటారు. దీని వృక్ష శాస్త్ర నామధేయం ఎట్రోకార్పస్ ఇంటి గ్రిఫోలియా. మార్చి నుంచి జూలై వరకూ పనస చెట్టుకు బరువైన కాయలు వేలాడుతూ కనిపిస్తాయి. ఒక్కో చెట్టుకు 100 వరకూ కాయలు కాస్తాయి. ఒక్కో కాయ పది నుంచి ఇరవై కేజీల బరువు ఉంటుంది. అయితే ఈ కాయలు ఎంత బరువున్నా అందులో 30 శాతం మాత్రమే తినడానికి ఉపయోగపడతాయి.

పనసలో రకాలు

బంగారు పనస, కొబ్బరి పనస, ఖర్జూర పనస, వేరు పనస, చిన్నకోల పనస, గుండ్రు పనస, గులాబి పనస, కర్జపనస, తేనెపనస అనే రకాలు ఉన్నాయి. వివాహాది శుభ కార్యాలయాలకు అందిరినీ ప్రీతిపాత్రమైన పనస కాయ కూరకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ పనసకాయను పొట్టుగా కొట్టి వంటలకు ఉపయోగిస్తారు. అంతేకాకుండా లేత పనస కాయను చిన్న ముక్కలుగా తరిగి మసాలా కూరలకు ఉపయోగిస్తారు.



అంబాజీపేటలో విక్రయానికి ఉంచిన పనసకాయలు



పనస తొనలు

పనసలో పోషకాలు

పనస కాయలో ఉండే పోషకాలు చాలా విలువైనవని. సీజన్‌లో దొరికే పండ్లను కచ్చితంగా తినాలని వైద్యులు పేర్కొంటున్నారు. మాంసకృతులు 1.9 శాతం, చక్కెర పదార్థం 19.8 శాతం, కొవ్వులు 0.1 శాతం, కెరోటిన్ 175 మైక్రో గ్రాములు, థియోమిన్ 0.3 మిల్లీ గ్రాములు, విటమిన్ సి 7 మిల్లీ గ్రాములు, పీచు పదార్థాలు 1.1 శాతం, సున్నం 20.0 మిల్లీ గ్రాములు, ఇనుము 0.56 మిల్లీ గ్రాములు లభిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అంబాజీపేట పనసంటే మక్కువ



తింటే గారెలు తినాలి... లేదా అంబాజీపేట పనస తినాలి అనే నానుడి పూర్వం నుంచి ఆచరణలో ఉంది. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల వారు అంబాజీపేట పనస పండంటే ఎంతో మక్కువని పూర్వీకులు చెబుతుండేవారు. పనసలో ఉండే రకాలన్నీ అంబాజీపేట చుట్టు పక్కల ప్రాంతాల్లోనే లభిస్తాయి. అంతేకాకుండా పనస పంటపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాటిని సంరక్షిస్తుంటారు.

– గంటి ప్రభు, అంబాజీపేట

రక్తాన్ని వృద్ధి చేస్తుంది



పనస పండు శరీర పుష్టిని కలిగించి రక్తాన్ని వృద్ధి చేస్తుంది. మెదడుకు, నరాలకు, కండరాలకు బలాన్ని కల్గిస్తుంది. బాగా మగ్గిన పండు మనోఉల్లాసాన్ని కలిగిస్తుంది. మూత్రాన్ని బాగా జారీ చేసి వాతాన్ని, పైత్యాన్ని నివారిస్తుంది. రోజూ పరగడుపున పనస తొనలను తినడం వల్ల శరీరానికి మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. పనస తొనలను నూనె, తేనెలలో ముంచి తింటే జీర్ణం సులభంగా అవుతుందని పెద్దల నానుడి.

– వి.గౌతమి, వైద్యాధికారి, అంబాజీపేట

మళ్లీ జగన్‌కే పట్టం



పాటి శివకుమార్

సఖినేటిపల్లి: సీఎంగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పట్టం కట్టే విధంగా వచ్చే నెల 4న నిర్వహించే ఓట్ల లెక్కింపుల్లో ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ పాటి శివ కుమార్ అన్నారు. సోమవారం సఖినేటిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ వేదికగా మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి చేయబోయే ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్ర ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసినా కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి జగనన్న విద్యా దీవెన, ఫీజు రీ ఇంబర్స్‌మెంట్, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలను డీబీటీ ద్వారా నేరుగా సీఎం జగన్ కోట్లాది మేర నిధులు ఖాతాలకు జమ చేయించారన్నారు. సామాన్య ప్రజల కష్టాలు తెలిసిన సీఎం జగన్ నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రోత్సాహక బహుమతులు పొందిన గుడిమెళ్లంక విద్యార్థులు

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక చారిటబుల్ ట్రస్ట్ సంస్థ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదును బహుమతిగా అందించారు. ఇటీవల విడుదలైన పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కరబరిచిన సుమారు పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మర్రిపేట పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ రిటైర్డ్ ఆర్మీ అధికారి చెల్లుబోయిన సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఈ ప్రోత్సాహం ఉపయోగకరంగా ఉంటుందని ఇలా సాయం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కడలి సాయిబాబు, చెల్లుబోయిన సూర్యచంద్రరావు, నాగూరు, చిట్టూరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమల విస్తరణకు కార్యాచరణ



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న కంపెనీ ఎండీ వేణుగోపాల్

మామిడికుదురు: కొబ్బరి ఆధారిత పరిశ్రమలను విస్తరించే దిశగా కార్యాచరణ చేపట్టామని మామిడికుదురు నారియల్ న్యూట్రా ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఎండీ నయినాల వేణుగోపాల్ తెలిపారు. మామిడికుదురులోని సంస్థ కార్యాలయంలో సోమవారం యువ, మహిళా పారిశ్రామిక వేత్తల అవగాహన, ఉద్యోగ ఆధార్ మేళా జరిగింది. పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ మాట్లాడుతూ కొబ్బరి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ దిశగా రైతుల్లో చైతన్యం తీసుకు వస్తున్నామన్నారు. పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ ప్రొడ్యూసర్ కంపెనీగా ఏర్పడే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహాలు అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కొబ్బరి పరిశ్రమలను విస్తరించే అంశంపై ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్, కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో తాను చర్చించానని ప్రొడ్యూసర్ కంపెనీ ఎండీ చెప్పారు. నారియల్ కంపెనీ పరిధిలో కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీ కొరకు అవసరమైన కామన్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన రెండెకరాల భూమితో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరానన్నారు. సమావేశంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ ఎ.మాధురి, రైతులు యెరుబండి లక్ష్మయ్య, మట్టపర్తి రెడ్డి, మసూద్ మొహిద్దీన్, గెద్దం రాంబాబు, పల్లి ఏసురత్నం, తదితరులు పాల్గొన్నారు.

చదువుకుని ప్రయోజకులు కావాలి



మామిడికుదురు శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నకులరాజు

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ చదువుకుని ప్రయోజకులు కావాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.నకులరాజు సూచించారు. షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో సోమవారం విద్యార్థులకు ఉచిత సమ్మర్ క్లాసులు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 5వ తేదీ వరకు ఈ క్లాసులు జరుగుతాయని మండల శాఖ అధ్యక్షులు భూపతిరాజు మనోహర్ రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు గణితం, సైన్సు, ఇంగ్లిషు సబ్జెక్టుల్లో సరైన బేసిక్స్ లేక వెనుకబడుతున్నారని జిల్లా అధ్యక్షుడు నకులరాజు పేర్కొన్నారు. అటువంటి విద్యార్థుల్లో వెనుకబాటు తొలగించేందుకు షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం కార్యాచరణ చేపట్టిందన్నారు. ప్రతి మండలంలో ఉచిత సమ్మర్ క్లాసులు నిర్వహిస్తుందన్నారు. 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఈ క్లాసులు నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బంగార్రాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రరావు, భూపతి వెంకటపతి, బత్తుల రమేష్‌బాబు, నేరేడిమిల్లి సత్యనారాయణ, భయ్యా మోహనరావు, మట్టా శ్రీధర్, కె.రత్నం రాజు పాల్గొన్నారు.

మెగా రక్తదానం ఇతర సంఘాలకు ఆదర్శం



వాడపాలెంలో రక్తదానం చేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

కొత్తపేట: సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సేవా దృక్పథం అభినందనీయమని వైద్య విధాన పరిషత్ స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. వైద్యుడు మాట్లాడుతూ నేడు ఎన్టీఆర్ అభిమానులు మెగా రక్తదానం కార్యక్రమం ద్వారా ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచారని అభినందించారు. శెట్టిబలిజ యువత ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం మండలంలోని వాడపాలెంలో ఘనంగా నిర్వహించారు. కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో అమలాపురం ఏరియా ఆస్పత్రి సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరానికి 31 మంది యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ముందుగా బర్త్‌డే కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది, ఎన్టీఆర్ అభిమాన సంఘం సభ్యులు ఎస్.మణికంఠ, డి.మధు, డి.సుబ్రహ్మణ్యం, డి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సంధిపూడిలో రోగిని పరీక్షిస్తున్న సాయికిషోర్

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత సీజన్‌లో సంభవించే మలేరియా జ్వరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కొత్తపేట డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులోని మూడు గ్రామ సచివాలయ పరిధిలో ఇటుక బట్టీ కార్మికుల కుటుంబాలను సందర్శించారు. ఈసందర్భంగా పరీక్షలు నిర్వహించి మలేరియా వ్యాప్తి చెందే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే సంధిపూడిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్యాధికారి డి.సాయికిషోర్ సుమారు 120 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఎంపీహెచ్ఎస్ ముద్రగడ శ్రీనివాసరావు, వైద్యారోగ్య సిబ్బంది కె.సుమాంజలి, భాను, శ్వేత, కె.విజయలక్ష్మి, ఎస్.సంధ్యారాణి, ఆర్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

అంబాజీపేట: విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విద్యార్థులు గ్రంథాయాలను ప్రతినిత్యం వినియోగించుకోవాలని గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో చిన్నారులు పుస్తక పఠనం సోమవారం చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న చరిత్ర పుస్తకాలను, కథలను చదివడం వల్ల విజ్ఞానం పొందుతారన్నారు. వీటితో పాటు విద్యకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆర్ల అక్కమ్మ జాతర

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులో కొలువుదీరిన ఆర్ల అక్కమ్మ వారి జాతర సోమవారం అత్యంత వైభవంగా ఆలయ కమిటీ సభ్యులు జరిపారు. అమ్మవారిని గ్రామంలో మేళతాలతో, బాజా భజంత్రీలతో అంగరంగ వైభవంగా ఊరేగించారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న గ్రామ ఆడపడుచులు గ్రామానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు. అమ్మవారి భక్తులు దండుగమ్మ కావెళ్ల మొక్కు తీర్చారు. మంగళవారం భారీ ఎత్తున తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారికి గండ దీపాలను సమర్పిస్తారు.

వైభవంగా పార్వతీ కైలాసేశ్వరస్వామి కల్యాణం



అవిడిలో పార్వతీ కైలాసేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామంలో వేంచేసిన పార్వతీ కైలాసేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం 'శ్రీశైవాగమోక్తంగా' జరిగింది. దేవదాయ-ధర్మదాయ శాఖ అధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 24 వరకూ నిర్వహించే కల్యాణోత్సవాల్లో భాగంగా దేవస్థానం ఈఓ సీహెచ్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు రాంపల్లి రాజారావు, పండితుల బృందం ఆదివారం రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల వైకుంఠాన్ని తలపిస్తూ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు కల్యాణ తలంబ్రాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. అవిడి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం నందివాహన సేవ నిర్వహించారు. అలాగే మండలంలోని వాడపాలెంలో రమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తలంబ్రాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. వాడపాలెం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

అంబాజీపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుమందు తాగి వ్యక్తి మృతి చెందినట్లు అంబాజీపేట పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.గన్నవరం మండలం పోతవరం ప్రభలదిబ్బకు చెందిన కాప లోవరాజు (31) ఈ నెల 14న అంబాజీపేటలో తన మేనకోడలు ఇంటికి వచ్చాడు. అనంతరం పురుగుమందు తాగడంతో అతడిని అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు కాప దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

మరో ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అంబాజీపేట: స్థానిక డీసీసీ బ్యాంకు ఎదురుగా సోమవారం జరిగి రోడ్డు ప్రమాదంలో స్కూటీ, మోటారు సైకిళ్లు ఢీ కొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానికుడు గోళ్ల కృష్ణ తన ఇంటి వద్ద నుంచి స్కూటీపై అంబాజీపేట సెంటర్‌కు వస్తున్నాడు. అదే సమయంలో ముంగండ నుంచి అమలాపురం వైపు పల్సర్ బైక్‌పై వెళుతున్న పితాని సాయికుమార్, బొక్కా నరేష్‌లు స్కూటీని బలంగా ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో కృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు, బంధువులు అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అతి వేగం, అజాగ్రత్త కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సాయికుమార్, నరేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

హలో... ఏంటి పరిస్థితి!

- పార్టీ అభ్యర్థుల గెలుపు, ఓటములపై ఆరా
- ఎక్కడ చూసిన ఇదే చర్చ
- కూడికలు, తీసివేతల్లో శ్రేణుల నిమగ్నం

అంబాజీపేట: 'హలో'.. ఎలా ఉన్నారు.. ఇంటిలో అందరూ బాగున్నారా.. ఏమిటి విశేషాలు.. సమ్మర్‌ను ఎలా ఎంజాయ్ చేస్తున్నారని కుశల ప్రశ్నలతో బంధువులు ఫోన్‌లో అడిగిన అనంతరం ఏంటి పరిస్థితి? మీ దగ్గర ఎవరు గెలుస్తారు? ఎన్ని ఓట్ల మెజార్టీ వస్తుందనుకుంటున్నారు ? అవతల పార్టీ అభ్యర్థికి ఎన్ని పడుంటాయ్? అయితే మన పార్టీ క్యాండిడేట్ గెలుపు గ్యారంటీ అన్న మాట. అది సరే.. స్టేట్‌లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనుకుంటున్నారు? నీకున్న సమాచారం ఓ సారి చెప్పు» ఇద్దరు వ్యక్తుల ఫోన్ సంభాషణ ఇది. పోలింగ్ ముగిశాక నేడు అభ్యర్థులు, పార్టీల గెలుపోటములపైనే అందరి దృష్టి ఉంది. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో ఏ ఇద్దరు కలిసినా సర్వత్రా ఇదే చర్చ కనిపిస్తోంది.

అంతేకాదు.. ఎక్కడెక్కడో ఉన్న వారు సైతం తమ స్నేహితులు, బంధువులకు ఫోన్లు చేసి ఎన్నికల ఫలితాలెలా ఉంటాయన్న దానిపైనే మాట్లాడుకుంటున్నారు. సాధారణ ప్రజలకంటే ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలు వీటిపైన మరింతగా చర్చించుకుంటున్నారు. ఆయా పార్టీ అభ్యర్థులకు ఎన్ని ఓట్లుపోలై ఉంటాయి ? వాటిలో గెలుపు అంశాలు ఎంత వరకు ఉంటాయన్న దానిపై బేరిజు వేసుకుంటున్నారు. మహిళలు, పురుషులు, వృద్ధులు, యువకులు ఎవరికి వేశారోనని ఆరా తీస్తున్నారు. ఆయా పార్టీ అభ్యర్థులకు ఎన్ని ఓట్లు పోలై ఉంటాయి ? వాటిలో గెలుపు అంశాలు ఎంత వరకు ఉంటాయన్న దానిపై బేరీజు వేసుకుంటున్నారు. మహిళలు, పురుషులు, వృద్ధులు, యువకులు ఎవరికి వేశారోనని ఆరా తీస్తున్నారు. దానిని బట్టి ఫలానా అభ్యర్థి/పార్టీ గెలుస్తుందని లేదా ఓటమి పాలవుతారని అంచనా కొస్తున్నారు. ఇలా కూడికలు, తీసివేతల్లో నిమగ్నమై ఉన్నారు. లెక్కలు, అంచనాల్లో తలమునకలై ఉన్నారు. మరో వైపు టీవీల్లోను, సోషల్‌మీడియాలోను, యూట్యూబ్ చానళ్లలోనూ ఇప్పటికే అనధికారికంగా ఎగ్జిట్ పోల్స్ పేరిట ఏ పార్టీకి ఎన్ని సీట్లొస్తాయన్నది జోస్యం చెప్పేస్తున్నారు. ఆయా పార్టీ శ్రేణులు, రాజకీయాలపై ఆసక్తి ఉన్నవారు వీటిని ఎక్కువగా వీక్షిస్తున్నారు. మరోవైపు పోలింగ్‌కు ముందు కూటమి అభ్యర్థులదే గెలుపంటూ పందెల కోసం హడావుడి చేసిన వారు ఇప్పుడు వెనక్కి తగ్గారు. మరి కొందరు ఆ పార్టీకి ఇన్ని సీట్లు వస్తాయి, ఆ ఎమ్మెల్యేలు నెగ్గుతారంటూ పందాలు కాసుకుంటున్నారు. ఫలితాలు వెలువడే జూన్4వ తేదీ వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

అల్లరిమూకలపై చర్యలు తప్పవు



చింతనలంకలో నాయకులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కేవీ రమణ

అయినవిల్లి: ఎన్నికల నేపథ్యంలో అల్లరిమూకలు గ్రామాల్లో విచ్చలవిడిగా రెచ్చిపోతే వారిపై కఠినచర్యలు తప్పవని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ అన్నారు. సోమవారం ఆయన సీఐ డి.ప్రశాంత్‌కుమార్, స్థానిక ఎస్సై బి.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో చింతనలంకలో ఏఎన్ఎస్ పార్టీతో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కేటుగాళ్లు, నేరగాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. గ్రామంలో వాహనాలను లైసెన్స్ లేకుండా, సరైన సర్టిఫికెట్ చూపించకుండా ఉన్న 15 బైక్‌లను సీజ్ చేశారు. అలాగే 10 డీపీఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో నాయకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టపరంగా నడుచుకోకపోతే వారిని క్షమించేది లేదని హెచ్చరించారు.

ఆనందోత్సాహాలతో ఇమామే రజా జయంతి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, ఎనిమిదో ప్రవక్త హజరత్ ఇమామ్ రజా జయంత్యుత్సవాన్ని నగరం గ్రామంలో సోమవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దీనిలో భాగంగా మామిడికుదురులోని ఇమామ్ రజా పంజాతో పాటు మొగలికుదురు గ్రామం జగ్గన్నపేటలోని బడా ఆస్థానాలో మిలాద్‌లు జరిగాయి. మత ప్రబోధకులు సయ్యద్ అబ్బాస్ బాఖరి, మొహ్మద్ ఇబ్రహీంలు హజరత్ ఇమామ్ రజా జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను, మహిమలను భక్తులకు వివరించారు. దీనిలో భాగంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా భక్తులను అలరించారు.

ఉచిత విద్యకు 64 మంది ఎంపిక

ఆలమూరు: అర్హులైన పేద విద్యార్థు లకార్పొరేట్ విద్యలో భాగంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాల ల నుంచి 64 మంది ఎంపికయ్యారు. వీరిలో ప్రస్తుతం 40 మంది కార్పొ స్కూళ్లలో చేరినట్లు ఎంఈఓ తెలిపారు.